ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వార్తలు
సోమవారం 5 ఆగస్టు 2024 | 5



నేడు కలెక్టరేట్‌లో గ్రీవెన్స్

అమలాపురం టౌన్, ఆగస్టు 4: కలెక్టరేట్ గోదావరి భవన్‌లో సోమవారం ఉదయం 10 గంటల నుంచి ప్రజా సమస్యల ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం యథావిధిగా జరుగుతుందని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఫిర్యాదుదారులు తమ సమస్యలను జిల్లా యంత్రాంగం దృష్టికి తీసుకువచ్చి పరిష్కార మార్గాలు పొందాలని ఆయన కోరారు.



శుభప్రదం.. శ్రావణం

నేటి నుంచి శ్రావణం
మోగనున్న పెళ్లి బాజాలు
ప్రత్యేక పూజల నెల

● అమలాపురం రూరల్/అంబాజీపేట

శుభప్రదమైన మాసం శ్రావణ మాసం.. సోమవారం నుంచి ప్రారంభమయ్యింది. ప్రత్యేక పూజా కార్యక్రమాలకు, వివాహాలు, గృహ ప్రవేశాలు, ఇతర శుభకార్యక్రమాలకు ఈ మాసం ఎంతో అనువైనది. వస్త్ర వ్యాపారాలు, బంగారం కొనుగోళ్లు ఇలా ఎన్నో వ్యాపారాలు జోరందుకునే మాసం కూడా శ్రావణమే.. ఒక విధంగా చెప్పాలంటే మార్కెట్‌సరికొత్త శోభను సంతరించుకుంటుంది. ఆషాఢం వెళ్తూవెళ్తూ శ్రావణ వెలుగులను తీసుకువస్తుంది. శ్రావణం రాక కోసం అన్నివర్గాల వ్యాపారులు ఆశగా ఎదురు చూస్తున్నారు.



ప్రతి ఇల్లు శోభాయమానం

సోమవారం నుంచి శ్రావణ సందడి మొదలవుతోంది. శ్రావణ మాసమంతా నోములు, వ్రతాలు, పండుగలతో ప్రతీ ఇంటా సందడే. పల్లె, పట్టణం అన్న బేధం లేకుండా ప్రతీ ఇంటా లక్ష్మీకళ ఉట్టి పడుతుంది. శ్రీమహావిష్ణువు జన్మనక్షత్రం శ్రవణ. ఆ పేరుమీద వచ్చిన శ్రావణమాసం కావడంతో శ్రీలక్ష్మీ దేవికి ఎంతో ప్రీతిపాత్రమైన మాసం..ఈ మాసంలో ప్రతిరోజూ ఒక విశిష్టతను సంతరించుకుంటుంది. సోమవారం వ్రతాన్ని పరమశివుని ప్రీత్యర్థం జరుపుకుని భక్తులు ఉపవాసాలుంటారు. ఇక ప్రతీ మంగళవారం కొత్తగా వివాహమైన స్త్రీలు మంగళ గౌరి వ్రతాలు జరుపుకుంటారు. తిథి, నక్షత్రాలను బట్టి సూపౌదన వ్రతం, అవ్యంగ సప్తమీవ్రతం, పుష్పాష్టమి వ్రతం, అనంగ వ్రతం జరుపుకోవడం ఆనవాయితీగా వస్తుంది. ఇక ఈ నెల 16న ప్రతి ఇంటా వరలక్ష్మీ వ్రతాలు జరుపుకుంటారు. ఇక ఈ నెల 6న మంగళగౌరి వ్రతం, 7న స్వర్ణగౌరి వ్రతం జరుపుకుంటారు. 8న నాగచతుర్థి, 9న నాగపంచమి, 13 మంగళగౌరి వ్రతం, 18 వరాహ జయంతి జరుపుకుంటారు. 19వ తేదీన వచ్చే పౌర్ణమికి ఓ ప్రత్యేక స్థానం ఉంది. ఈ పౌర్ణమిని రాఖీ పౌర్ణమి అంటారు. ఇక జంధ్యాల పౌర్ణమి కూడా కావడంతో జీర్ణమయ యజ్ఞోపవీతాలను విసర్జించి కొత్త వాటిని ధరిస్తారు. 26న వచ్చే శ్రీకృష్ణ జన్మాష్టమి ప్రత్యేకమైన పండుగ..

ఆలయాలు కళకళ

శ్రావణ మాసం సందర్భంగా పలు అమ్మవారి ఆలయాలతో పాటు ప్రముఖ ఆలయాలను అందంగా తీర్చిదిద్దారు. ఆలయాల్లో నిత్యం వ్రతాలు, హోమాలు నిర్వహించేందుకు ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ వ్రతాలు, హోమాల్లో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించుకుంటారు. ముఖ్యంగా పలు ఆలయాల్లో సామూహిక వరలక్ష్మి వ్రతాలకు ఈ మాసంలో విస్తృతంగా ఏర్పాట్లు చేస్తారు. అలాగే గౌరీవ్రతాలకు కూడా సన్నాహాలు చేస్తున్నారు..





11 మంది ఎస్‌ఐలు బదిలీలు

అమలాపురం, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పదకొండు మంది ఎస్‌ఐలను బదిలీ చేస్తూ ఎస్పీ బి.కృష్ణారావు ఉత్తర్వులు జారీ చేశారు. కొత్తపేట ఎస్‌గా పనిచేస్తున్న దేవర జ్వాలాసాగర్‌ను ముమ్మిడివరం పోలీసుస్టేషన్‌కు బదిలీ చేశారు. ద్రాక్షారామ ఎస్‌ఐ జి.సురేంద్రను కొత్తపేటకు, కొత్తపేట ఎస్‌ఐగా పనిచేస్తున్న ఎం.అశోక్‌ను ఆలమూరు పోలీసుస్టేషన్‌కు, అయినవిల్లి ఎస్‌ఐ బి.రాజేష్‌కుమార్‌ను రాజోలు పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేశారు. నగరం ఎస్‌ఐ పీవీవీఎస్ఎన్ సురేష్‌ను మలికిపురానికి, ముమ్మిడివరం ఎస్‌ఐ డి.సురేష్‌బాబును మండపేట రూరల్‌కు బదిలీ చేశారు. మండపేట రూరల్ ఎస్‌ఐ ఎ.చైతన్యకుమార్‌ను నగరానికి, వీఆర్‌లో ఉన్న ఐ.అవినాష్‌ను కాట్రేనికోనకు, ఆలమూరు ఎస్‌ఐ ఎల్.శ్రీనునాయక్, మలికిపురం ఎస్‌ఐ బి.సంపత్‌కుమార్, కాట్రేనికోన ఎస్‌ఐ ఎస్.నాగేశ్వరరావును వీఆర్‌లో ఉంచారు.

గోదారమ్మా.. మన్నించమ్మా..

డంపింగ్ యార్డులా రావులపాలెం వద్ద గౌతమి గోదావరి తీరం
ఇళ్లు, ఆస్పత్రుల్లో వ్యర్థాలను ఇక్కడే డంప్ చేస్తున్న వైనం
కలుషితమవుతున్న గోదావరి జలాలు..నది పవిత్రతకు దెబ్బ



అందంగా..ఆహ్లాదకరంగా ఉండాల్సిన గోదావరి తీరం పేరుకుపోయిన చెత్తతో అధ్వానంగా మారింది. కనుచూపుమేర అంతెత్తు వ్యర్థాల మేటలతో కంపుగొడుతోంది. గోదావరి జలాలు పరమ పవిత్రమైనవి. పుణ్యస్నానాలు చేయడంతో పాటు పూజా కార్యక్రమాలు, గోదావరి తల్లికి హారతులు ఇస్తూ ఓ దైవంగా భావిస్తారు. అలాంటి పవిత్రత గల నీరు పూర్తిగా కలుషితమయ్యే పరిస్థితి ఏర్పడింది. కోనసీమ ముఖద్వారం రావులపాలెం వచ్చేవారికి గౌతమి గోదావరి తీరం దుర్వాసన వెదజల్లుతూ స్వాగతం పలుకుతోంది.

● (రావులపాలెం)







గోదావరి తీరంలో అంతెత్తున డంప్ అయిన వ్యర్థాలు

పర్యావరణానికి ముప్పు

ఈ ప్రాంతంలో సంచరించే వన్యమృగాలు, వివిధ రకాల పక్షులు గోదావరి తీరానికి దురమయ్యాయి. గ్రామంలో సెప్టిక్ ట్యాంకుల్లోని వ్యర్థాలను సైతం ఇక్కడ నదీ గర్భంలో వదిలేస్తున్నారన్న ఆరోపణలు సైతం సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. ఇక్కడ డంపింగ్ యార్డులో ఆసుపత్రుల్లో వినియోగించే సూదులు, సిరంజిలతో పాటు అన్ని రకాల వ్యర్థాలను నిత్యం ట్రాక్టర్లతో పడవేస్తుండటంతో గౌతమి వంతెన మీద రాకపోకలు సాగించే వాహనదారులు ప్రయాణికులు ఆ దుర్వాసన భరించలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఒక్క ఏటిగట్టు ప్రాంతమే కాకుండా జాతీయ, గ్రామీణ ప్రాంత రహదారుల చెంతకే ఆయా గ్రామాల చెత్తచెదారాలను తరలించడంతో కంపుకొడుతున్న డంపింగ్ యార్డులు దర్శనమిస్తున్నాయి. ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు వచ్చే సమయాల్లో హడావిడిగా జేసీబీల సాయంతో చెత్తను సరిచేసి బ్లీచింగ్ చల్లి హడావిడి చేస్తుంటారు. ఆ తర్వాత తీరాన్ని పట్టించుకునేవారే ఉండడం లేదు.

సందర్శకుల ఆవేదన

గౌతమి గోదావరి తీరంలో రింగ్‌బండ్, ఏటిగట్టు మధ్యగల ఖాళీప్రదేశంతో పాటు ఏటిగట్టుపై కూడా గ్రామంలోని చెత్త, వ్యర్థాలను వేస్తూ డంపింగ్ యార్డ్‌లా మార్చేశారు. దీని వల్ల గోదావరి తీరం అపరిశుభ్రంగా మారడంతో పాటు పర్యవరణానికి ముప్పు ఏర్పడే ప్రమాదం ఉంది. గోదావరి అందాలు తిలకిస్తూ ఆ సోయగాలను చూసి పులకించే పోయే ప్రకృతి ఆరాధకులకు ఈ డంపింగ్ యార్డును చూసి ఆవేదన చెందుతున్నారు. సహజత్వం ఉట్టిపడే గోదావరి అందాలను చూసేందుకు గోదావరికి వరదలు వచ్చిన సమయంలోను, అప్పుడప్పుడు మిగిలిన సమయాలలోను సాయంత్రం వేళల్లో ప్రకృతి ప్రేమికులు గౌతమి తీరానికి వచ్చేవారు. అయితే ఇప్పుడు ఒక్కరు కూడా అటువైపు వెళ్లే సాహసం చేయడం లేదు.

శాకంబరి నమో..నమః



గంగలకుర్రు గ్రామదేవత శ్రీరావులమ్మ అమ్మవారిని ఆదివారం ఆషాఢం ముగింపును పురస్కరించుకుని శాకంబరిగా అలంకరించారు.
● అంబాజీపేట



ఆషాఢమాసం ఆఖరి ఆదివారం సందర్భంగా మొగలికుదురు గ్రామ దేవత పళ్లాలమ్మ భక్తులకు శాకంబరి అలంకారంలో దర్శనమిచ్చారు.
● మామిడికుదురు

ఖేలో ఇండియా రైజింగ్ టాలెంట్ ఎంపికలు

అమలాపురం టౌన్, ఆగస్టు 4: భారతీయ ఖేల్ అధికార్ స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఈ నెల 6న అథ్లెటిక్స్, వాలీబాల్, వెయిట్ లిఫ్టింగ్ విభాగాల్లో ప్రతిభావంతులను ఎంపిక చేయనున్నట్లు డాక్టర్ వైఎస్సార్ ఇంటర్నేషనల్ ఇండోర్ స్టేడియం ఇన్‌చార్జి ఎన్.ఉదయభాస్కర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తొమ్మిదేళ్ల నుంచి 18 ఏళ్ల వయసు గల క్రీడాకారులను ఖేలో ఇండియా రైజింగ్ టాలెంట్ ఐడెంటిఫికేషన్ కార్యక్రమంలో భాగంగా ఎంపిక చేస్తామన్నారు. 6వ తేదీ ఉదయం 8 గంటలకు క్రీడాకారులు జీఎంసీ బాలయోగి స్టేడియంలో హాజరు కావాలన్నారు. హాజరయ్యే క్రీడాకారులు అమలాపురం బాలయోగి స్టేడియంలో ఉన్న జిల్లా స్పోర్ట్స్ అథారిటీ కార్యాలయంలో రిపోర్టు చేయాలన్నారు. ఆయా క్రీడల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన వారిని వివిధ పోటీలకు ఎంపిక చేయనున్నట్లు చెప్పారు.

రైతులకు ఉపయోగపడని తవ్వకాలు

ముంపులో ఉన్న పొలాలకు ప్రయోజనం లేదు
రైతు పరిరక్షణ సమితి నాయకులు



తొలగింపు పనులను పరిశీలిస్తున్న నేతల బృందం

ఉప్పలగుప్తం, ఆగస్టు 4: మొగ వద్ద ఇసుక మేటల తొలగింపు పనులు ప్రస్తుతం ముంపులో ఉన్న పొలాలకు ఎంత మాత్రం ప్రయోజనం లేదని కోనసీమ రైతు పరిరక్షణ సమితి నాయకులు వ్యాఖ్యానించారు. కూనవరం మొగ వద్ద నాలుగు ఎక్సకవేటర్లతో జరుగుతున్న ఇసుక తవ్వకాలను ఆదివారం వారు పరిశీలించారు. పన్నెండు అడుగుల లోతున ఇసుకను తవ్వి సమీపంలోనే గుట్టలుగా వేయడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. దీని వల్ల గాలులకు, వర్షాలకు ఇసుక తవ్విన ప్రదేశంలో మళ్లీ మేటవేయడం సాధారణమేనని అన్నారు. తవ్విన ఇసుకను ఎప్పటికప్పుడు వేరే ప్రాంతానికి తరలిస్తే ఫలితముంటుందని చెప్పారు. సార్వా పొలాలకు ముంపు నుంచి రక్షణ కోసం మొగ తవ్వాలని తాము పదే పదే అధికారులను అభ్యర్థించామన్నారు. అయితే ప్రస్తుతం మందకొడిగా జరుగుతున్న తవ్వకాల వల్ల సార్వా పొలాలకు ఎంత మాత్రం ముంపు నుంచి రక్షణ లభించదని వారు ఆందోళన వ్యక్తం చేశారు. రైతు పరిరక్షణ సమితి అధ్యక్షుడు యాళ్ల బ్రహ్మానందం, ప్రధాన కార్యదర్శి అయితాబత్తుల ఉమామహేశ్వరరావు, దామిశెట్టి చంటి, నీటి పంపిణీ సంఘం మాజీ ఛైర్మన్ అరిగెల నానాజీ, రైతు నాయకులు నల్లా సత్యనారాయణమూర్తి, మారిశెట్టి రాముడు, జిన్నూరి శ్రీను పాల్గొన్నారు.



సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

వర్గీకరణకు వ్యతిరేకంగా పోరాటాలు

మాల మహానాడు ఆధ్వర్యంలో ముఖ్య నాయకుల సమావేశం

అమలాపురం టౌన్, ఆగస్టు 4: మాలమహానాడు జేఏసీ ఆధ్వర్యంలోనే ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాటం జరుగుతుందని జేఏసీ సమావేశం తీర్మానించింది. మాలమహానాడు ముఖ్య నాయకుల సమావేశం ఆదివారం అమలాపురంలో నిర్వహించారు. జాతీయ, రాష్ట్ర, జిల్లా, సంఘాల ప్రముఖులు సమావేశానికి హాజరయ్యారు. మాలమహానాడు కమిటీలన్నీ జేఏసీగా ఏర్పడి ఈ నెల 11న మాల మృతవీరుల సంస్మరణ దినోత్సవం నిర్వహించేందుకు నిర్ణయించాయని నాయకులు చెప్పారు. మాల మృతవీరులకు నివాళులర్పించిన అనంతరం ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక నిరసన కార్యక్రమం చేపట్టేందుకు తీర్మానించారు. పీవీ రావు త్యాగాన్ని నిర్వీర్యం చేసే అధికారం ఎవరికీ లేదన్నారు. సమావేశంలో నాయకులు పండు అశోక్‌కుమార్, ఎంఏకే భీమారావు, జగడం సత్యనారాయణ, చీకురుమెల్లి కిరణ్‌కుమార్, ఉండ్రు బాబ్జి, పోతుల నాగరాజు, పెనుమాల చిట్టిబాబు, కాశి వెంకట్రావు, పెయ్యల పరశురాముడు, పరమట రాంప్రసాద్, జల్లి శ్రీనివాస్, నాతి శ్రీనివాస్, చింతా రామకృష్ణ, ఉబ్బన శ్రీను, మెండి డేవిడ్ అంబేడ్కర్ పాల్గొన్నారు.



శనేశ్వరాలయంలో శాంతి హోమాలు

కొత్తపేట, ఆగస్టు 4: మందపల్లి శనేశ్వర(మందేశ్వర) స్వామివారి ఆలయంలో ఆదివారం ఆషాఢ బహుళ అమావాస్యను పురస్కరించుకుని ఆలయ ప్రధాన అర్చకులు అయిలూరి శ్రీరామమూర్తి ఆధ్వర్యంలో వేద పండితులు ప్రత్యేక పరోక్ష శాంతి హోమములు నిర్వహించారు. ఆలయ సహాయ కమిషనరు, ఈవో కె.విజయలక్ష్మి పాల్గొన్నారు.

ఆలయంలో అష్టోత్తర పూజలు



వాడపల్లి ఆలయంలో భక్తుల సందడి

ఆత్రేయపురం, ఆగస్టు 4: కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామిని ఆదివారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు దర్శించుకున్నారు. వివిధ సేవల ద్వారా ఒక్కరోజు ఆదాయం రూ.2,53,385 లభించినట్టు ఉప కమిషనరు, ఈవో భూపతిరాజు కిశోర్‌కుమార్ తెలిపారు. ఆలయంలో నిర్మిస్తున్న వకుళమాత అన్నదాన భవన నిర్మాణానికి రాజవరానికి చెందిన కందుకూరి సూర్యతేజ- సౌమ్యసుందరి దంపతులు రూ.50 వేలు విరాళం సమర్పించారు. దాతలకు స్వామివారి చిత్రపటాన్ని అందించారు

జాతీయ స్థాయి యోగా పోటీలకు ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న సీఐ

అమలాపురం టౌన్, ఆగస్టు 4: జాతీయ స్థాయి యోగా పోటీలకు అమలాపురం నుంచి ముగ్గురు విద్యార్థులు ఎంపికైనట్టు యోగా గురువు ఆకుల శ్రీనివాస్ తెలిపారు. చెన్నైలో ఈ నెల 8న జరిగే జాతీయస్థాయి యోగా పోటీల్లో ఎ.ప్రవీణ్, పి.దినేష్, ఎ.దీపక్ పాల్గొంటారు. ఇటీవల విశాఖపట్నంలో జరిగిన రాష్ట్ర స్థాయి యోగా పోటీల్లో అమలాపురం విద్యార్థులు ప్రథమ స్థానం సాధించారని శ్రీనివాస్ చెప్పారు. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన శ్రీస్వామి వివేకానంద యోగాశ్రమం విద్యార్థులను పట్టణ సీఐ కె.క్రిస్టఫర్ ప్రత్యేకంగా అభినందించారు.



కాలం నీ నేస్తం ముస్తఫా...

మోతుగూడెం మన్యంలో కొద్ది రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు జలపాతాలు పాలనురగలా జాలువారుతూ ఆకట్టుకుంటున్నాయి. పొల్లూరు జలపాతం అందాలు మురిపిస్తున్నాయి, ఈ ప్రాంతానికి కింద పచ్చని చెట్లు ప్రకృతి ప్రేమికులకు ఆకట్టుకుంటున్నాయి. భారీ వర్షాలకు కొండవాగు ప్రాంతాలు జలపాతాలను తలపిస్తూ ప్రవహిస్తున్నాయి. ఆదివారం ఫ్రెండ్‌షిప్‌డే కావడంతో పర్యాటకులు పొల్లూరు జలపాతం వద్ద సందడి చేశారు. ముస్తఫా... ముస్తఫా డోంట్ వర్రీ ముస్తఫా... కాలం నీ నేస్తం ముస్తఫా అంటూ పాట పాడుకుంటూ ఆనందంగా గడిపారు.

- మోతుగూడెం



ఉదయిస్తు భానుడూ...

శ్రీసూర్యనారాయణ మేలుకో... హరి సూర్యనారాయణ అన్నట్టుగా ఉంది కదూ... తూర్పు గోదావరి జిల్లా పెరవలి మండలం తీపర్రు వద్ద గోదావరిలో ఆదివారం కనిపించిన సూర్యోదయం చిత్రమిది. - పెరవలి

నేటి నుంచి సత్యదేవుని ఆవిర్భావ వేడుకలు

అనంతలక్ష్మి అమ్మవారికి వజ్రకిరీటం సమర్పించనున్న దాత మట్టే సత్యప్రసాద్

అన్నవరం, ఆగస్టు 4: రత్నగిరివాసుడైన సత్యదేవుని క్రోధి నామ సంవత్సర ఆవిర్భావ వేడుకలు సోమవారం ప్రారంభం కానున్నాయి. ఉదయం 8 గంటలకు గణపతి పూజ, పుణ్యాహవచనం, కలశస్థాపన జరుపుతారు. మంగళవారం స్వామివారి ఆవిర్భావ దినోత్సవం నిర్వహిస్తారు. ఈ సందర్భంగా ఆలయాన్ని వివిధ సుగంధభరిత పుష్పాలతో అలంకరించనున్నారు. అనివేటి మండపంలో ఆయుష్య హోమం చేస్తామని అధికారులు వెల్లడించారు.

సత్యదేవుని దేవేరి అనంతలక్ష్మి అమ్మవారికి లలిత రైస్ ఇండస్ట్రీస్ అధినేతల్లో ఒకరైన మట్టే సత్యప్రసాద్ తయారు చేయించిన వజ్రకిరీటం, స్వామి, అమ్మవార్ల వజ్రకర్ణాభరణాలను దేవస్థానం అధికారులకు సోమవారం మధ్యాహ్నం అందజేయనున్నారు. ఈ మేరకు దాత ఆదివారం దేవస్థానం అధికారులు, పండితులతో చర్చించారు. మంగళవారం ఉదయం మూలవిరాట్‌లకు పంచామృతాభిషేకాల అనంతరం వజ్రకిరీటంతో భక్తులకు దర్శనమివ్వనున్నారు. కార్యక్రమంలో లలిత రైస్ ఇండస్ట్రీస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మట్టే ఆదిశంకర్ పాల్గొన్నారు.

సత్యదేవుని సన్నిధిలో మంత్రి దుర్గేష్, ఎమ్మెల్యేలు



రత్నగిరివాసుడైన సత్యదేవుని ఆదివారం రాష్ట్ర టూరిజం, సిని మాటోగ్రఫీ శాఖల మంత్రి కందుల దుర్గేష్, దెందులూరు ఎమ్మెల్యే ధర్మరాజు, తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్, పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప దర్శించారు. దేవస్థానంలో జరిగిన ఒక ఫంక్షన్‌కు వీరంతా హాజరయ్యారు. వారికి పీఆర్వో కృష్ణారావు, ఏపీఆర్వో గణపతిరావు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు.

ఆనాటి ఆ స్నేహ ఆనంద గీతం...



వీరంతా శ్రీకాకుళంలోని గురజాడ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్‌లో 1993-94 బ్యాచ్ బీఈడీ విద్యార్థులు. ఇందులో రవికుమార్, దేవానంద్, చంద్రరావు, రాంబాబు, రాజారావు తూర్పు గోదావరి జిల్లాలోని పలు పాఠశాలల్లో ఉపాధ్యాయులుగా పని చేస్తున్నారు. వారి సహాధ్యాయి డి.నరసింహ కిశోర్ ప్రస్తుతం తూర్పు గోదావరి జిల్లా ఎస్పీ. ఆదివారం వారంతా రాజమహేంద్రవరంలో కలుసుకున్నారు. ఎస్పీకి స్నేహితుల దినోత్సవ శుభాకాంక్షలు చెప్పారు. ఆలనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ కొద్దిసేపు ఆనందంగా గడిపారు.

... రాజమహేంద్రవరం సిటీ

చంద్రబాబు పాలనతో పరిశ్రమలకు భరోసా

- 'అల్ట్రాటెక్' ప్రమాద మృతులకు భారీ పరిహారం చెల్లించాం
- ఈఎస్ఐ పరిధిలోకి అసంఘటిత కార్మికులు, జర్నలిస్టులు
- తప్పుడు పనులు చేసేవారిని సమర్థించేది లేదు
- మీట్ ది ప్రెస్‌లో మంత్రి కార్మిక శాఖ మంత్రి సుభాష్



రామచంద్రపురం (ద్రాక్షారామ), ఆగస్టు 4: ముఖ్యమంత్రి చంద్రబాబు పాలనతో రాష్ట్రంలో పరిశ్రమలకు భరోసా వచ్చిందని రాష్ట్ర కార్మిక, పరిశ్రమల శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురంలోని బుచ్చిరాజు కల్యాణ మండపంలో ఆదివారం నిర్వహించిన 'మీట్ ది ప్రెస్'లో ఆయన మాట్లాడారు. ఇటీవల అల్ట్రాటెక్ సిమెంటు పరిశ్రమలో జరిగిన ప్రమాదంలో మృతి చెందిన నలుగురి కుటుంబాలకు రూ.50 లక్షలు చొప్పున పరిహారం చెల్లించామన్నారు. గత వైసీపీ పాలనలో పరిశ్రమల్లో భద్రతా చర్యలు తీసుకోవడంలో థర్డ్ పార్టీని ప్రవేశపెట్టి పరిశ్రమలను దోచుకున్నారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పారిశ్రామికవేత్తలకు భరోసా లభించిందన్నారు. రాష్ట్రంలో అసంఘటిత రంగ కార్మికులను, జర్నలిస్టులను ఈఎస్ఐ పరిధిలోకి తీసుకువచ్చే ఆలోచన చేస్తున్నామన్నారు. ఈఎస్ఐ సౌకర్యంతో మెరుగైన వైద్య సేవలు పొందే అవకాశం ఉంటుందన్నారు. ఆరోగ్యశ్రీ పథకంపై భారం తగ్గుతుందన్నారు. ఈ విషయాన్ని సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తామన్నారు. వైసీపీ ప్రభుత్వం ఈఎస్ఐ కింద కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నిధులను సద్వినియోగపరచలేదన్నారు. 34 మంది వైసీపీ కార్యకర్తలను చంపినట్టు సాక్షి చానల్‌లో తప్పుడు ఆరోపణలు చేశారని, వారి పేర్లు చెప్పమంటే మాజీ సీఎం జగన్‌కు మాటలు రావడం లేదన్నారు. ప్రభుత్వంపై తన పత్రిక, చానల్ ద్వారా జగన్ తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. ఇటీవల పామర్రు పోలీస్ స్టేషన్ పరిధిలో బెదిరింపు కేసులో ఇద్దరు టీడీపీ నాయకులపై కేసు నమోదు చేశారని, వారిని అరెస్టు చేసేందుకు గాలిస్తున్నారన్నారు. తాను వారిని సమర్థిస్తున్నట్టు తప్పుడు వార్తలు ప్రచారం చేశారని, తాను మద్దతు ఇస్తే వారిపై పోలీసు కేసు నమోదు ఎందుకు అవుతుందన్నారు. తప్పుడు పనులుచేసే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ సమర్థించనని స్పష్టం చేశారు. రామచంద్రపురం నియోజకవర్గంలో 30 వేల మందికి ఇళ్ల స్థలాలు పంపిణీ చేస్తామన్నారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, నియోజకవర్గంలో ప్రెస్‌క్లబ్ భవనం నిర్మాణానికి సహకరిస్తానన్నారు. నియోజకవర్గ పరిధిలో దివ్యాంగులకు ఉద్యోగాలు, వైద్య పరీక్షలు, కృత్రిమ అవయవాలు సమకూర్చేందుకు మెగా శిబిరం ఏర్పాటు చేయిస్తానన్నారు. ల్యాబ్‌లు, మెడికల్ షాపులు నియంత్రణ పాటించాలని, లేనిపక్షంలో తానే కనీస చార్జీలతో ల్యాబ్, మెడికల్ షాపు పెడతానని హెచ్చరించారు. డీఎస్సీ పరీక్ష రాసేవారికి ఉచితంగా కోచింగ్ ఇచ్చేందుకు ఉద్దేశించిన పోస్టర్‌ను మంత్రి సుభాష్ ఆవిష్కరించారు. తన పూర్తి సహకారంతో ఎక్కువ మంది ఉపాధ్యాయ ఉద్యోగాలు పొందేందుకు వీఎస్ఎం కళాశాలలో ఉచిత కోచింగ్ ఇస్తామని చెప్పారు.

హౌసింగ్ మాయాజాలం!

- టీడీపీ హయాంలో ఇల్లు మంజూరు
- వైసీపీ హయాంలో నిర్మాణం
- బిల్లు మంజూరు కాక అప్పులు చేసి పూర్తి
- రూ.77వేలు చెల్లించినట్టు రికార్డుల్లో...
- ఖాతాలో ఒక్క రూపాయి కూడా జమ కాని వైనం
- ఆవేదన చెందుతున్న వృద్ధ దంపతులు



కొప్పవరంలో వృద్ధ దంపతులు నిర్మించుకున్న ఇల్లు


అనపర్తి, ఆగస్టు 4: తూర్పు గోదావరి జిల్లా అనపర్తి మండలంలో హౌసింగ్ మాయాజాలం వెలుగు చూసింది. గృహ నిర్మాణం చేసుకున్న లబ్ధిదారులకు సుమారు రూ.77వేలు చెల్లించినట్టు అధికారులు రికార్డుల్లో చూపిస్తున్నారు. అయితే తమ ఖాతాలోకి ఒక్క రూపాయి కూడా జమకాలేదంటున్నారు లబ్ధిదారులు. వివరాలు ఇలా వున్నాయి... తూర్పు గోదావరి జిల్లా అనపర్తి మండలం కొప్పవరం గ్రామానికి చెందిన సత్తి తాతారెడ్డి-మంగయ్యమ్మ దంపతుల పాత ఇల్లు శిథిలావస్థకు చేరుకోడంతో 2018లో అప్పటి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డిని ఆశ్రయించగా హౌసింగ్ లోన్ మంజూరు చేయించారు. దాంతో వారు తమ వద్ద ఉన్న కొద్దిపాటి సొమ్ముతో గృహ నిర్మాణం ప్రారంభించారు. 2019లో ప్రభుత్వం మారడంతో ఒక్క బిల్లూ మంజూరు కాలేదు. దీంతో అప్పులు చేసి ఇంటి నిర్మాణం పూర్తి చేశారు. అయినా నేటికీ ఒక్క రూపాయి కూడా అందకపోవడంతో మాజీ సర్పంచ్, టీడీపీ సీనియర్ నాయకుడు కర్రి వెంకటరామారెడ్డిని ఆశ్రయించడంతో ఆయన వారిని వెంటపెట్టుకుని హౌసింగ్ కార్యాలయానికి చేరుకుని ఆరా తీశారు. వీరికి 2020 జూన్ 23న రూ.1, 2020 జూలై 24న రూ.19,299, 2023 జూన్ 20న రూ.19,500 2023 జూలై 6న రూ.38,800 జమ చేసినట్టు రిపోర్టు ఇచ్చారు. దీంతో మాజీ సర్పంచ్ వారిని వెంటబెట్టుకుని మహేంద్రవాడలోని స్టేట్ బ్యాంకుకు వెళ్లగా వారి ఖాతాలో హౌసింగ్ నుంచి ఒక్క రూపాయి కూడా జమకాలేదని స్టేట్‌మెంట్ ఇవ్వడంతో ఖంగుతిన్నారు. తిరిగి హౌసింగ్ కార్యాలయానికి చేరుకుని ఏఈ వనమయ్య, డీఈ వేణుగోపాల్‌లకు పరిస్థితిని వివరించగా మంగయ్యమ్మకు చెందిన రెండో ఖాతాలో సొమ్ము జమ అయినట్టు రిపోర్టు ఇచ్చారు. తిరిగి అదే బ్యాంకుకు వెళ్లినా ఆ ఖాతాలో కూడా ఒక్క రూపాయీ పడలేదని తేలింది. ఇంటి నిర్మాణం కోసం అప్పులు చేశామని, కుమారుడిని కూడా పోగొట్టుకున్నామంటూ వృద్ధ దంపతులు కన్నీరుపెట్టుకున్నారు. దీంతో మాజీ సర్పంచ్ వెంకటరామారెడ్డి అధికారులను నిలదీయగా... సాంకేతికలోపంతో ఇలా జరిగి ఉండవచ్చని, ఇప్పటివరకు విషయం తమ దృష్టికి రాలేదని ఉన్నతాధికారులకు తెలియజేస్తామని డీఈ వేణుగోపాల్ తెలిపారు. లోపాన్ని సరిచేసి రెండు, మూడు రోజుల్లో సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా వెంకటరామారెడ్డి మాట్లాడుతూ బాధితులకు రుణం మొత్తం రూ.1.50 లక్షలు ఒకేసారి అందించేలా చర్యలు చేపట్టాలన్నారు. గతంలో టీడీపీ హయాంలో మంజూరైన అనేక మందికి బిల్లులు రాలేదని, అధికారుల చుట్టూ తిరగలేక వారంతా ఊరుకున్నారని, విచారణ జరిపిస్తే ఇలాంటి అనేక సంఘటనలు బయటపడతాయన్నారు.



తాతారెడ్డి, మంగయ్యమ్మ దంపతులు

వైద్య రంగంలో 'మైక్రో బయాలజీదే కీలక భూమిక

- అంతర్జాతీయ గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్ 'పద్మభూషణ్' డాక్టర్ నాగేశ్వర్ రెడ్డి
- జీఎస్ఎల్ మెడికల్ కళాశాలలో ముగిసిన ఐఎంఏ సదస్సు



రాజానగరం, ఆగస్టు 4: రానున్న ఐదేళ్లలో వ్యాధి నిర్ధారణ, చికిత్సలకు మైక్రోబయాలజీ మూలాధారం అవుతుందని అంతర్జాతీయ ఖ్యాతిగాంచిన గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్ 'పద్మభూషణ్' డాక్టర్ డి.నాగేశ్వర్ రెడ్డి అన్నారు. తూర్పు గోదావరి జిల్లా రాజానగరం సమీపంలోని జీఎస్ఎల్ మెడికల్ కళాశాలలో రెండు రోజులు జరిగిన ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) సౌత్ జోన్ వైద్య విజ్ఞాన సదస్సు ఆదివారం ఘనంగా ముగిసింది. ఈ సందర్భంగా డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. బ్యాక్టీరియా గురించి చర్చించే మైక్రోబయాలజీ రంగంలో ప్రపంచవ్యాప్తంగా 100 సెంటర్లలో అధ్యయనాలు, పరిశోధనలు జరుగుతున్నాయన్నారు. దేశంలోని ఆరు కేంద్రాల్లో పరిశోధనలు జరుగుతుండగా..... ప్రైవేట్ రంగంలో ఏకైక సంస్థ ఏషియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ గ్యాస్ట్రో ఎంటరాలజీ-ఏఐజీ ఛైర్మన్‌గా తాను వ్యవహరిస్తున్నట్టు చెప్పారు. సహజ స్వాభావిక ఆహారం, అవసరమైన బ్యాక్టీరియాను ఇవ్వడమే వ్యాధులకు భవిష్యత్తులో చికిత్స అవుతుందని వివరించారు. పేగుల్లో నివసించే వెయ్యి రకాల బ్యాక్టీరియాలో హెచ్చు తగ్గులు రకరకాల వ్యాధులకు కారణమవుతున్నాయని చెప్పారు. ప్రధానంగా ఆహారంలో మార్పుల వల్లే బ్యాక్టీరియాలో సమతూకం దెబ్బతిని రకరాల జబ్బులు, వ్యాధులు సంక్రమిస్తున్నాయని నాగేశ్వర్‌రెడ్డి వివరించారు. సిజేరియన్ కాకుండా సహజ ప్రసవం ద్వారా పుట్టిన బిడ్డలు, కనీసం ఆరు నెలలు తల్లి పాలు తాగిన బిడ్డలు, ఆరు నెలలలోపు యాంటీబయాటిక్స్ వాడని పిల్లల్లో మంచి బ్యాక్టీరియా వల్ల ఆరోగ్య సమస్యలు తలెత్తడం లేదని ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఇంటి భోజనం చేసే వారికి, బయట జంక్ ఫుడ్ తీసుకునే వారికి బ్యాక్టీరియాల్లో తేడాలను ప్రయోగాల్లో తమ సంస్థ గమనించిందన్నారు. మన వాతావరణానికి సరిపడే ఇడ్లీ, దోసె, పెరుగు మొదలైనవి తిన్నవారిలో కేన్సర్ నెమ్మదించినట్టు అధ్యయనాల్లో తేలిందన్నారు. ఇక్కడకు వచ్చిన ప్రతిసారీ జీఎస్ఎల్ వైద్య విద్యా సంస్థల ఛైర్మన్ డాక్టర్ గన్ని భాస్కరరావు కొత్త అనుభవాలను ఇనుమడింపచేస్తున్నారని డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డి ప్రశంసించారు. డాక్టర్ వాడ్రేవు రవి (కాకినాడ), డాక్టర్ వీఎస్ఎస్ఎన్ మూర్తి (అమలాపురం) ఛైర్‌పర్సన్లుగా వ్యవహ రించగా డాక్టర్ వాణీమాధవి (జీఎస్ఎల్), డాక్టర్ వీఎస్ఎస్ శర్మ (అమలాపురం), డాక్టర్ సోమనాథ్‌దాస్ (జీఎస్ఎల్) ముగింపు సదస్సు నిర్వహించారు. చివరగా డాక్టర్ నాగేశ్వర్ రెడ్డిని జీఎస్ఎల్ వైద్య విద్యా సంస్థల యాజమాన్యం దుశ్శాలువాతో సత్కరించింది.

కాపర్ వైరు దొంగలు దొరికారు

- తూర్పు గోదావరి, కాకినాడ జిల్లాలకు చెందిన పదకొండు మంది అరెస్టు
- మినీ వ్యాన్, ఆటో, రూ.2.40 లక్షలు విలువైన 420 కిలోల కాపర్ వైరు స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న కొవ్వూరు రూరల్ సీఐ శ్రీనివాసరావు



కొవ్వూరు, ఆగస్టు 4: పంట పొలాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు పగలుగొట్టి కాపర్ వైరు దొంగతనం చేస్తున్న 11 మందిని అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి ఒక మినీ వ్యాన్, ఆటో, రూ.2.40 లక్షలు విలువైన 420 కిలోల కాపర్ వైరు, దొంగతనాలకు వినియోగించిన పనిముట్లను స్వాధీనం చేసుకున్నారు. తూర్పు గోదావరి జిల్లా కొవ్వూరు రూరల్ సర్కిల్ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో దీనికి సంబంధించిన వివరాలను కొవ్వూరు రూరల్ సీఐ వి.శ్రీనివాసరావు వెల్లడించారు. కొవ్వూరు రూరల్ పోలీస్‌స్టేషన్‌లో 4, కొవ్వూరు టౌన్‌లో 2, తాళ్లపూడిలో 1, నల్లజర్లలో 3, చాగల్లులో 1, దేవరపల్లిలో 2, గోపాలపురంలో 1, రాజానగరంలో 2, కాకినాడ జిల్లా అన్నవరంలో 2 కేసులకు సంబంధించి 22 ట్రాన్స్‌ఫార్మర్లను పగలగొట్టి దొంతనాలకు పాల్పడిన ఏడుగురిని, కాపర్ వైర్ కొనుగోలు చేసిన నలుగురు వ్యాపారస్తులను అరెస్టు చేశారు. కొవ్వూరు మండలం వేములూరుకు చెందిన సారిక సురేష్ తాపీ పనిచేస్తూ అప్పుడప్పుడు హైదరాబాద్ వెళ్లి వస్తుండేవాడు. హైదరాబాద్‌లో కాకినాడ జిల్లాకు చెందిన పల్లా లోవరాజు, వేములూరుకు చెందిన తంపర సురేష్, సారిక దుర్గారావు, మట్టా శివ, మల్లిచెట్టు డోలానంద్, మంగిన అజిత్‌కుమార్, రేఖ సుధాకర్ ఒకేచోట తాపీ పని పనిచేస్తుండేవారు. సారిక సురేష్ ఎలక్ట్రీషియన్ పని నేర్చుకున్నాడు. ఖాళీ ట్రాన్స్‌ఫార్మర్లు ఎక్కడ ఉన్నాయో గుర్తించి వాటిలో రాగి వైరు అమ్ముకుంటే ఎక్కువ డబ్బులు సంపాదించుకోవచ్చని ఎనిమిది మంది నిర్ణయించుకున్నారు. పలు పోలీసుస్టేషన్ల పరిధిలో రాత్రి సమయాల్లో పంట పొలాల్లోని ట్రాన్స్‌ఫార్మర్ల పగలగొట్టి వాటిలోని కాపర్ వైరు వేరు చేసి పల్లా లోవరాజు వ్యానులో తీసుకొచ్చేవారు. అనంతరం వాటిని కొవ్వూరు మండలం సీతంపేటలో జై హనుమంతు టింకరింగ్ షాప్‌లో నరమామిడి సత్యనారాయణ, కాకినాడ జిల్లా కిర్లంపూడిలో శ్రీ వెంకట దుర్గా ఆంజనేయ ట్రేడర్స్‌లో సరిక కృష్ణ, పెరవలి మండలం కాపవరంలో చింతలపూడి సత్యనారాయణ, రాజమహేంద్రవరం లాలాచెరువు హౌసింగ్ బోర్డులో బీఆర్ఎస్ ఎంటర్‌ప్రైజస్‌లో పన్నెరు నంది కేశవరావులకు చెందిన పాత ఇనుప సామగ్రి కొనే షాపుల్లో విక్రయించేవారు. ఇటీవల కొవ్వూరు మండలం చిడిపిలో పంట పొలంలో ట్రాన్స్‌ఫార్మర్ దొంగతనానికి వెళ్తుండగా కొవ్వూరు రూరల్ పోలీసులు, క్రైం పోలీసులు దాడి చేసి ఏడుగురిని, ఆపై వైరు కొనుగోలు చేసిన నలుగురిని పట్టుకుని అరెస్టు చేశారు. దర్యాప్తులో విశేష కృషి చేసిన కొవ్వూరు రూరల్ ఎస్ఐ కె.సుధాకర్, క్రైం ఎస్ఐ కె.జగన్మోహనరావు, ఏఎస్ఐ జె.ధర్మరాజు, టి.శ్రీనివాసరావు, జి.అనీల్‌కుమార్, అఫ్సారీబేగ్, ఎస్.గణేష్, ఎస్కే వలీబాబు, హెచ్‌సీ జీఎస్ఆర్‌కే పరమహంసలను సీఐ అభినందించారు.

రైలులో గర్భిణి ప్రసవం

- అప్రమత్తమైన జీఆర్పీ పోలీసులు
- ఆసుపత్రికి తరలింపు... తల్లీబిడ్డ క్షేమం

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 4: బొకారో ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణం చేస్తున్న ఒక నిండు గర్భిణి పండంటి బిడ్డకు జన్మనిచ్చింది. జీఆర్పీ పోలీసుల కథనం ప్రకారం... బిహార్‌కు చెందిన అమరజీత్ రామ్. అతని భార్య హీరాకుమారి జీవనోపాధి నిమిత్తం కోయంబత్తూరులో ఉంటున్నారు. నెలలు నిండిన హీరాను బిహార్ తీసుకెళ్లడానికి ఈ నెల 3న బొకారో ఎక్స్‌ప్రెస్‌లో బయల్దేరాడు. రైలు రాజమహేంద్రవరం గోదావరి బ్రిడ్జి వద్దకు వచ్చేసరికి హీరాకు పురిటినొప్పులు రాగా వెంటనే మగ బిడ్డకు జన్మనిచ్చింది. ఈ సమాచారం తెలిసిన సీఐ విజయశంకర్ స్పందించి రైలు రాజమహేంద్రవరం రైల్వేస్టేషన్‌కు వచ్చేసరికి రైల్వే వైద్యులను, జీఆర్పీ సిబ్బందిని అప్రమత్తం చేశారు. స్టేషన్‌కు రైలు రాగానే తల్లీబిడ్డను కిందకు దింపించి స్టేషన్లో హెల్త్ చెకప్ చేయించి ఆపై 108 అంబులెన్స్‌లో రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. తల్లి, బిడ్డ క్షేమంగా ఉన్నట్టు వైద్యులు చెప్పారని విజయశంకర్ వివరించారు.



హీరాకు వైద్యం అందిస్తున్న వైద్యులు

గంజాయి గుట్టురట్టు

దివాన్‌చెరువు జీరో పాయింట్ వద్ద తనిఖీ... వ్యాను ప్రత్యేక అరలో 444 కిలోల పట్టివేత

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 4: తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం జాతీయ రహదారిపై దివాన్ చెరువు జీరో పాయింట్ వద్ద గంజాయి తరలిస్తున్న వ్యాన్‌ను పట్టుకుని 443.860 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నట్టు సౌత్‌జోన్ డీఎస్పీ ఎం.అంబికా ప్రసాద్ ఆదివారం తెలిపారు. ఎస్పీ కార్యాలయానికి వచ్చిన సమాచారంతో శనివారం సాయంత్రం దివాన్‌చెరువు వద్ద వ్యాన్‌ను తనిఖీ చేయగా అందులో 14 ప్లాస్టిక్ సంచుల్లో గంజాయి ఉందన్నారు. వ్యాన్‌ను సీజ్ చేసి తమిళనాడు 8వ క్రాస్‌స్ట్రీట్ హౌసింగ్ బోర్డు, కురుంబాపేటకు చెందిన డ్రైవర్ దివాకర్‌ను అరెస్టు చేశామన్నారు. అతన్ని విచారించగా.. ఈనెల 3న దివాన్‌చెరువు వద్దకు వచ్చిన డ్రైవర్ దివాకర్, వ్యాన్ యజమాని కలిసి గండేపల్లి మండలం మురారి గ్రామం వెళ్లారని, అక్కడ మరో వ్యక్తితో కలిసి వ్యానులో జగ్గంపేట వెళ్లి జాతీయ రహదారిలో ఏజెన్సీ రోడ్డులోకి సుమారు 9 కిలో మీటర్లు వెళ్లాక దివాకర్‌ను అక్కడే ఉంచి మిగిలిన ఇద్దరూ అడవిలోకి వెళ్లారు. కొన్ని గంటల తర్వాత ఇద్దరూ వ్యాన్‌లో తిరిగొచ్చారు. జగ్గంపేట వచ్చాక ఆ ఇద్దరు దిగిపోయి వ్యాన్‌ను జాగ్రత్తగా తమిళనాడులో దిండివనం ప్రాంతానికి చేర్చమని దివాకర్‌కు చెప్పారు. జాతీయ రహదారిపై వ్యాను వస్తుండగా దివాన్‌చెరువు వద్ద పట్టుకున్నామని, తనిఖీ చేయగా వ్యాన్ క్యాబిన్ వెనుక ఏర్పాటు చేసిన ప్రత్యేక అరలో గంజాయిని గుర్తించామని తెలిపారు. డ్రైవర్ దివాకర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని డీఎస్పీ అంబికా ప్రసాద్ తెలిపారు. తనిఖీల్లో బొమ్మూరు సీఐ ఎండీ ఉమర్, సబ్ ఇన్‌స్పెక్టర్ బి.శ్రీను పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ నరసింహకిశోర్ ఒక ప్రకటన విడుదల చేశారు. గంజాయి విక్రయం, వినియోగాన్ని నిరోధించడానికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని, జిల్లా అంతటా స్పెషల్ డ్రైవ్‌లు, కార్డన్ సెర్చ్, వాహనాల తనిఖీ తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. గంజాయి వల్ల కలిగే దుష్పరిణామాలపై హాస్టల్స్, పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు అవగాహన సదస్సులు నిర్వహిస్తామని చెప్పారు.



వివరాలు వెల్లడిస్తున్న సౌత్‌జోన్ డీఎస్పీ అంబికా ప్రసాద్

డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా

•అమలాపురం •పి.గన్నవరం •రాజోలు •ముమ్మిడివరం •కొత్తపేట •మండపేట •రామచంద్రపురం

18న తెలుగు భాషా దినోత్సవం

అమలాపురం టౌన్, ఆగస్టు 4: శ్రీశ్రీకళావేదిక ఆధ్వర్యంలో ఈ నెల18న అమలాపురంలో తెలుగుభాషా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు అంతర్జాతీయ చైర్మన్ కత్తిమండ ప్రతాప్ తెలిపారు. దీనిలో భాగంగా అమలాపురం అంబేడ్కర్ కమ్యూనిటీ హాలులో 138వ జాతీయ శతాధిక కవి సమ్మేళనం నిర్వహిస్తామన్నారు. తెలుగు భాషా దినోత్సవ పోస్టర్లను ఆదివారం అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, ప్రతాప్ ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆనందరావును సత్కరించారు.

స్నేహితుల ఆత్మీయ కలయిక

రాయవరం, ఆగస్టు4: స్నేహితుల దినోత్సవం పురస్కరించుకుని రాయవరం, చెల్లూరు గ్రామాల్లో పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక ఆదివారం ఉత్సాహంగా సాగింది. చెల్లూరు శ్రీసర్వారాయ జడ్పీ ఉన్నత పాఠశాల 1974-75 పూర్వ విద్యార్థులు ఆదివారం ఉదయం పాఠశాలలో కలుసుకున్నారు. యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. పాఠశాల తరగతిగదుల్లో కలియతిరిగి చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. కుటుంబసభ్యులను స్నేహితులకు పరిచయంచేసి, సహపంక్తి భోజ నాలు చేశారు. ఆత్మీయ కలయిక ఏర్పాటుకు కృషిచేసిన పూర్వ విద్యార్థులు నూనె వీరవెంకట సత్యనారాయణ(పెద్దబాబు), ఎస్.చిట్టిబాబు, పాలకుర్తి సత్యనారాయణ తదితరులను పూర్వ విద్యార్థులు అభినందించారు. రాయవరం శ్రీరామయ్య జడ్పీ ఉన్నత పాఠశాల 74-75పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం జరిగింది.

రాజోలు: మండలంలోని గ్రామాల్లో స్నేహితుల దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించుకున్నారు. రాజోలు వాసవీ, వనితా క్లబ్‌ల సంయుక్త ఆధ్వర్యంలో ఆర్యవైశ్య సభ్యులు స్నేహితుల దినోత్సవాన్ని ఆట పాటలతో జరుపుకున్నారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కాసు శ్రీనివాస్ మాట్లాడుతూ అన్ని బంధాల కన్నా స్నేహబంధం గొప్పదన్నారు. ఆర్యవైశ్య మహిళా సంఘం అధ్యక్షురాలు కాసు భవానీ, వాసవీక్లబ్ రీజియన్ చైర్మన్ రాజా నాగరత్నకుమార్, వాసవీక్లబ్ అధ్యక్షుడు కాసు శ్రీనివాస రంగనాయకమూర్తి, గెల్లి బాపనగుప్తా, కె.రామకృష్ణ, గెల్లి అన్నపూర్ణ, ఎం.విశాలక్షి, భ్రమరాంబ, లక్కింశెట్టి వెంకయ్య పాల్గొన్నారు.

అంబాజీపేట: అంబాజీపేట జడ్పీ హైస్కూల్‌కు చెందిన 1983-84 పూర్వపు విద్యార్థులు స్థానిక పాఠశాలలో స్నేహితుల దినోత్సవం సందర్భంగా ఆదివారం కలుసుకున్నారు. పాత జ్ఞాపకాలను గుర్తుచేసుకుని ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆనందంగా గడిపారు. రవణం వెంకట్రావు, మట్టపర్తి బాలాజీ, దొమ్మేటి సత్యనారాయణ, ఎండీఎస్ఎం షరీఫ్, సానబోయిన వెంకట సత్యనారాయణ, నిట్టాల సాయిరామ్ పాల్గొన్నారు.

అల్లవరం: జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 1987-88 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు స్నేహితుల దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. అల్లవరం గణపతి పబ్లిక్ స్కూల్ వద్ద కలుసుకుని ఆనందాన్ని పంచుకున్నారు. ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్, మంగళంపల్లి బాలసుబ్రహ్మణ్యం, కంకిపాటి గణపతిరావు, రుద్రరాజు సీతారామరాజు, బండిగుప్తాపు శ్రీనివాసరావు, కంకిపాటి శ్రీను, అడపా నాగేశ్వరరావు, వాసంశెట్టి శ్రీనివాసరావుతో పాటు పూర్వవిద్యార్థులు కలుసుకుని ఆనందంగా గడిపారు.

కొత్తపేట: స్నేహితుల దినోత్సవాని కొత్తపేటలో నిర్వహించారు. కొత్తపేట వాసవీ క్లబ్ అధ్యక్షుడు లింగేశ్వరరావు ఆధ్వర్యంలో స్థానిక వాసవీమాత ఆలయంలో స్నేహితులందరూ కలుసుకుని ఫ్రెండ్‌షిప్ బ్యాండులు కట్టుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. పచ్చిపులుసు కృష్ణారావు, సత్యవరపు జమీందార్, యెండూరి పవన్‌కుమార్, శ్రీకాకోళపు బాబి, తమ్మన సాయిప్రసాద్, గమిడి ఆనంద్, శ్రీకాకోళపు చిన్ని, కొత్త చినబాబు పాల్గొన్నారు.

కపిలేశ్వరపురం: పలు గ్రామాల్లో స్నేహితుల దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. స్నేహితులందరూ ఫ్రెండ్‌షిప్ బ్యాండ్స్ కట్టుకుని స్నేహబంధాన్ని చాటుకున్నారు. ఒకరికొకరు ఆలింగనం చేసుకుని స్వీట్స్ తినిపించుకున్నారు.

ఘనంగా తిరునక్షత్ర ఉత్సవాలు

ఆత్రేయపురం, ఆగస్టు 4: వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి తిరునక్షత్ర ఉత్స వాలు రెండో రోజు ఆదివారం వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి కుంకుమార్చన, విశేష పూజలు, ద్రవిడవేద పారాయణం, కుంకుమార్చన, నీరాజన మంత్రపుష్పం, బాలభోగం తదితర కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయంలో ప్రాకారోత్సవం వైభవంగా నిర్వహించారు. ఉపకమిషనరు, ఈవో భూపతిరాజు కిశోర్‌కుమార్ పాల్గొన్నారు.

వెండి వస్తువుల బహూకరణ



అయినవిల్లి, ఆగస్టు 4: విశాఖపట్నానికి చెందిన అద్దేపల్లి శ్రీనివాస్-కల్యాణి దంపతులు కుటుంబ సమేతంగా ఆదివారం అయినవిల్లి శ్రీవిఘ్నేశ్వరస్వామివారిని దర్శించుకున్నారు. అన్నప్రసాదట్రస్టుకు రూ.10,116 అందించారు. స్వామికి రూ.70వేలువిలువైన 801గ్రాముల వెండి జల్లెడ, వెండికలశలను అందించారు. వారికి ప్రధానఅర్చకులు వేదాశీర్వచనం చేసి శేషవస్త్రంతో సత్కరించారు.

అమ్మవార్లు శాకంబరిగా దర్శనం

అంబాజీపేట, ఆగస్టు4: గంగలకుర్రు గ్రామదేవత శ్రీరావులమ్మ అమ్మవార్ని ఆదివారం గ్రామస్థుల ఆధ్వర్యంలో వివిధ రకాల కూరగాయలతో శాకంబరిగా అలంకరించారు. ఆలయంలో అమ్మవార్కి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అమ్మవార్ని దర్శించుకుని మొక్కులుతీర్చుకున్నారు.

శాకంబరిగా పల్లాలమ్మ అమ్మవారు

మామిడికుదురు, ఆగస్టు 4: ఆషాఢం ఆఖరి ఆదివారం మొగలికుదురు గ్రామదేవత పల్లాలమ్మ భక్తులకు శాకంబరిగా దర్శనమిచ్చారు. ఉదయం ఆరు గంటల నుంచి అమ్మవారి దర్శనానికి భక్తులు బారులు తీరారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

శాకంబరిగా తాటమ్మతల్లి

పి.గన్నవరం, ఆగస్టు 4: పి.గన్నవరం గ్రామదేవత తాటమ్మతల్లి శాకంబరిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆషాఢ మాసం చివరి రోజు అమ్మవార్కి ప్రత్యేక పూజలు నిర్వహించారు. 35రకాల కూరగాయలతో అమ్మవార్ని అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవార్ని దర్శించుకున్నారు. పి.గన్నవరం శివారు తాడాలమ్మ తల్లి, కొండాలమ్మ అమ్మవార్లకు ఆదివారం పసుపు నీళ్లతో అభిషేకం నిర్వహించారు. అనంతరం ప్రత్యేక పూజలు చేపట్టారు.

పసుపు కొమ్ములతో సత్తెమ్మతల్లికి అలంకరణ

ముమ్మిడివరం, ఆగస్టు 4: ఆషాఢ మాసం ఆఖరి ఆదివారం సందర్భంగా సీహెచ్ గున్నేపల్లి సత్తెమ్మతల్లి అమ్మవారిని పసుపు కొమ్ములతో అలంకరించారు. సలాది జయకృష్ణ ఆధ్వర్యంలో అమ్మవారిని విశేష అలంకరణ చేశారు. మేకల పెదకాపు కుమారులు, గొలకోటి నాగేశ్వరరావు, పేరిచర్ల విశ్వనాథరాజు, దొడ్డిపట్ల రామకృష్ణ ఆర్థిక సాయంతో అమ్మవారికి పులిహోరను నైవేద్యంగా సమర్పించి భక్తులకు పంపిణీ చేశారు. మేకల సతీష్ ఆలయ దర్శనానికి వచ్చిన చిన్నపిల్లలకు పాలు పంపిణీ చేశారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయం వద్ద ప్రత్యేక భజన కార్యక్రమం నిర్వహించారు. కాకినాడ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు ఆదివారం సత్తెమ్మతల్లి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఈసందర్భంగా ప్రత్యేక పూజలు జరిపించారు. ముమ్మిడివరం ఎస్ఐ బి.సురేష్‌బాబు ఆధ్వర్యంలో భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటుచేశారు. ఏఎంసీ మాజీ చైర్మన్ గొలకోటి దొరబాబు, నడింపల్లి శ్రీనివాసరాజుఉన్నారు.



ఆలమూరు:చింతలూరు కనకదుర్గమ్మ, ముమ్మిడివరం: సత్తెమ్మతల్లి, పి.గన్నవరం: తాటమ్మతల్లి, ద్రాక్షారామం:గోగులంబ

గోగులమ్మ అమ్మవారికి సారె సమర్పణ

ద్రాక్షారామ, ఆగస్టు 4: వెలంపాలెంలో వేంచేసియున్న గోగులాంబ అమ్మవారికి ద్రాక్షారామ భీమేశ్వరస్వామివారి దేవస్థానం నుంచి సారెసమర్పించారు. స్వీట్లు, పట్టుచీర, పసుపు, కుంకుమ, ఫలాలు, పుష్పాలు సమర్పించారు. కార్యక్రమంలో ఈవో పి.టి.వి.సత్యనారాయణ, ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు. అమ్మవారి ఆలయంలో ఆషాఢ మాసం కావిడి మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. జగన్నాయకులపాలెం, వెలంపాలం, తోటపేట గ్రామాలకు చెందిన భక్తులు అమ్మవారికి చీరలు, జాకెట్లు, గాజులు, స్వీట్లు, పండ్లు, పసుపు, కుంకుమ సమర్పించారు. మాణిక్యాంబ మహిళా సమాజం ఆధ్వర్యంలో లలితా పారాయణం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

శాకంబరిగా మాణిక్యాంబ అమ్మవారు

హసన్‌బాదలో వేంచేసియున్న భీమేశ్వరస్వామి, మాణిక్యాంబ అమ్మవారికి ఆదివారం శాకంబరి అలంకరణ జరిపారు. ముత్తయిదువులు అమ్మవారికి సారె సమర్పించారు. సహస్రకుంకుమార్చన, లలితాపారాయణ జరిపారు.

శాకంబరిగా కనకదుర్గమ్మ

ఆలమూరు, ఆగస్టు4: చింతలూరులోని కనకదుర్గ అమ్మవారిని ఆదివారం శాకంబరిగా అలంకరించారు. ఆషాఢ అమావాస్య ఆదివారం సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూలు నిర్వహించి భక్తులు సమకూర్చిన వివిధ రకాల కూరగాయలతో అమ్మవారిని శాకంబరిగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవార్ని దర్శించుకున్నారు.

మతోన్మాద శక్తులను బలహీన పరచడమే సీపీఎం లక్ష్యం



మాట్లాడుతున్న రాష్ట్ర ప్రతినిధి రమాదేవి

అమలాపురం టౌన్, ఆగస్టు 4: దేశాన్ని పట్టి పీడిస్తున్న మతోన్మాద శక్తులను బలహీన పరచడమే సీపీఎం లక్ష్యమని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యురాలు డి.రమాదేవి చెప్పారు. ప్రజాసమస్యల పరిష్కారం కోసం నిరంతర పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. సీపీఎం జిల్లా విస్తృతస్థాయి సమావేశం అమలాపురంలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం గుదే దుర్గాప్రసాద్, కె.కృష్ణవేణి అధ్యక్షతన నిర్వహించారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీ 400 స్థానాల్లో గెలుస్తామని ప్రకటించి నైతికంగా ఓడిపోయిందన్నారు. సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు బి.బలరామ్, ఆంధ్ర మాల్యాద్రి మాట్లాడుతూ ప్రజా సమస్యలను ఎజెండాగా తీసుకుని భవిష్యత్తు ఉద్యమాలను నిర్వహిస్తామన్నారు. వరద బాధిత కుటుంబాలకు రూ.3వేలు చొప్పున అందించకపోవడం శోచనీయమన్నారు. పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.50వేలు నష్టపరిహారం చెల్లించాలన్నారు. ఉపాధి కూలీలకు బకాయి పడ్డ రూ.70కోట్ల వేతనాలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సీపీఎం జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు, కమిటీ సభ్యులు పీతల రామచంద్రరావు, నూకల బలరామ్, టి.నాగవరలక్ష్మి, సకిలే సూర్యనారాయణ, తాడి శ్రీరామమూర్తి పొలమూరి శ్రీనివాసరావు, భీమాల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మంత్రి సుభాష్ రూ.10వేలు సాయం

ద్రాక్షారామ, ఆగస్టు 4: ద్రాక్షారామ గ్రామానికి చెందిన అనారోగ్యంతో బాధపడుతున్న వాసంశెట్టి జ్యోష్ణకు కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ఆదివారం రూ.10వేలు ఆర్థికసాయం అందజేశారు.

ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ఆందోళన



చల్లపల్లి పీవీరావు సెంటర్‌లో ఆందోళన చేస్తున్న ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి నాయకులు

ఉప్పలగుప్తం, ఆగస్టు 4: ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీం తీర్పును నిరసిస్తూ చల్లపల్లిలో ఆదివారం వర్గీకరణ వ్యతిరేక పోరాటసమితి ఆధ్వర్యంలో ఉద్యమించారు. ఒకే రాజ్యాంగం ఆధారంగా నడుస్తున్న అత్యున్నత న్యాయస్థానం ఎస్సీ వర్గీకరణకు గతంలో వ్యతిరేకంగా, ఇప్పుడు అనుకూలంగా తీర్పు ఇవ్వడం ఎలా సాధ్యపడిందని జిల్లా దళిత ఐక్యవేదిక ప్రధాన కార్యదర్శి ఇసుకపట్ల రఘుబాబు సందేహం వ్యక్తం చేశారు. ఎస్.యానాం, చల్లపల్లి, జల్లివారిపేట, బొండాడిపేట, చింతలచెరువుతో సహా 19గ్రామాల నుంచి మాలలు అధిక సంఖ్యలో తరలివచ్చి అమలాపురం-ఎస్.యానాం ఆర్అండ్‌బీ రహదారిపై పీవీ రావు సెంటర్‌లో రాస్తారోకో, ధర్నా నిర్వహించారు. కోర్టు తీర్పు ప్రజాస్వామ్య విరుద్ధమంటూ నినాదాలు చేశారు. వర్గీకరణను అడ్డుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో దళిత ఐక్యవేదిక చైర్మన్ డీబీ లోక్, కన్వీనర్ జంగా బాబూరావు, గెడ్డం సురేష్‌బాబు, రేవు తిరుపతిరావు, ములపర్తి సత్యనారాయణ, గెద్దాడ బుద్ధరాజ్, కాట్రు ఆనందరావు, చీకురుమెల్లి సత్యనారాయణ, కుసుమే వెంకన్న, గెద్దాడ వెర్రబ్బాయి పాల్గొన్నారు.

బీసీలు రాజకీయంగా మరింత ఎదగాలి



పదవీ విరమణచేసిన బీసీ ఉద్యోగుల సన్మానంలో పాల్గొన్న నాయకులు

అమలాపురం టౌన్, ఆగస్టు 4: బీసీలు విద్యా రంగంలో అభివృద్ధి చెందుతూ రాజకీయంగా ఎదిగి రాజ్యాధికారం చేపట్టాలని బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం జిల్లా శాఖ అధ్యక్షుడు గుబ్బల మురళీకృష్ణ పిలుపునిచ్చారు. అమలాపురం జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ఆదివారం మురళీకృష్ణ అధ్యక్షతన ఇటీవల పదవీ విరమణ చేసిన 25మంది బీసీ ఉద్యోగులు, పదోన్నతి పొందిన ఉద్యోగుల సన్మానోత్సవం నిర్వహించారు. జిల్లా, రాష్ట్ర సంఘ నాయకులు తొలుత పూలే, సావిత్రిబాయిపూలే చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు గుత్తుల వీరబ్రహ్మం, జిల్లా ప్రధాన కార్యదర్శి కర్రి సుబ్బరాజు, జిల్లా ఉపాధ్యక్షుడు సరిదే సత్యపల్లంరాజు, బొక్కా వీరవెంకటేశ్వరరావు, ఎస్.రాజరాజేశ్వరి ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథులుగా సమగ్ర శిక్షా జిల్లా అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ ఎ.మధుసూదనరావు, ఉపవిద్యాశాఖాధికారి గుబ్బల సూర్యప్రకాశం, వేండ్ర శ్రీనివాస్, కడలి సత్యనారాయణ తదితరులు హాజరయ్యారు. పదవీవిరమణ, పదోన్నతి పొందిన బీసీ ఉద్యోగులను సత్కరించారు. ఈసందర్భంగా జరిగిన సభలో ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు వీరబ్రహ్మం మాట్లాడుతూ బీసీ ఉద్యోగులు సమస్యల పరిష్కారంతో పాటు బీసీ విద్యార్థుల కోసం ఎంసెట్, డీఎస్సీ, పాలిటెక్నిక్ శిక్షణా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. విత్తనాల శ్రీనివాస్, పెచ్చెట్టి శ్రీనివాస్, సానబోయిన ఏడుకొండలు పాల్గొన్నారు.

దాణామృతం పంపిణీ

అంతర్వేది, ఆగస్టు 4: సఖినేటిపల్లిలం, అప్పనరామునిలంక గ్రామాల్లో రైతులకు సర్పంచ్‌లు, కూటమినాయకులు ఆదివారం దాణామృతం పంపిణీ చేశారు. దాణామృతం పంపిణీతో రైతులు సంతోషం వ్యక్తం చేశారు.

ఎస్సీ వర్గీకరణకు సుప్రీం తీర్పుపై హర్షం



రావులపాలెంలోని ముమ్మిడివర్పాడులో సంబరాలు చేసుకుంటున్న ఎమ్మార్పీఎస్ అభివృద్ధి సంక్షేమ సంఘ సభ్యులు

రావులపాలెం, ఆగస్టు 4: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంఇచ్చిన తీర్పుతో ఎమ్మార్పీఎస్ నాయకులు హర్షం వ్యక్తంచేశారు. ముమ్మిడివరప్పాడులో ఎమ్మార్పీఎస్ నాయకులు, అరుంధతి సంక్షేమ సంఘ సభ్యులు సంబరాలు జరుపుకున్నారు. జగ్జీవన్‌రామ్ విగ్రహానికి నివాళులర్పించారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. చదలవాడ ఆనందరావు, యార్లగడ్డ సత్తిబాబు, గంధంయాకుబ్, యార్లగడ్డ ముమ్మ,చదలవాడ మసేను, కాప నాగరాజు, తొత్తరమూడి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సుప్రీం తీర్పుతో అన్ని వర్గాలకు న్యాయం

కపిలేశ్వరపురం, ఆగస్టు4: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుతో న్యాయం జరిగిందని, ఎస్సీల్లోని అన్ని వర్గాల వారు తీర్పును స్వాగతించాలని దళిత నాయకులు మల్లిపూడి శివకుమార్ అన్నారు. ఆదివారం కపిలేశ్వరపురంలో మాదిగ సేవా సంఘం ఆధ్వర్యంలో సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిస్తూ డాక్టర్ బాబుగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలువేసి పాలాభిషేకం నిర్వహించి స్వీట్స్ పంపిణీ చేశారు. సుదీర్ఘ పోరాటంచేసిన మందకృష్ణమాదిగకు నాయకులు ధన్యవాదాలు తెలిపారు. ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు యార్లగడ్డ సత్యనారాయణను సన్మానించారు. పలివెల వెంకట్రావు, ముమ్మిడివరపు పెదసత్యం, చినసత్యం, కొమ్ము సతీష్, పలివెల సత్యనారాయణ, నాగరాజు, పిప్పర సతీష్‌చంద్ర, పలివెల సూర్యప్రకాష్, కొమ్మురాజు, పిప్పర రాజు పాల్గొన్నారు.

రైస్‌మిల్లర్ల సమస్యల పరిష్కారానికి చర్యలు



రైస్‌మిల్లర్స్ అధ్వర్యంలో ఎమ్మెల్యే బండారుకు సత్కారం

ఆలమూరు, ఆగస్టు 4: రైస్‌మిల్లర్ల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటిని పరిష్కరించేందుకు చర్యలు చేపడతానని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. అయితే రైతులు పండించిన పంటను సకాలంలో వారికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా మిల్లర్లు పూర్తిగా సహకరించాలని కోరారు. ఆలమూరులో ఆదివారం ఆలమూరు మండల రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే బండారు సత్యానందరావుతోపాటు పలువురు జనసేన, టీడీపీ నేతలు రెడ్డి సుబ్రహ్మణ్యం, బండారు శ్రీనివాస్, కెవీ.సత్యనారాయణరెడ్డి, ఆకుల రామకృష్ణ, బండారు సంజీవ్‌లను సత్కరించారు. గత ప్రభుత్వ కాలంలో రైస్‌మిల్లర్లు ఎదుర్కొన్న సమస్యలు తమ దృష్టికి వచ్చాయని వాటిని పరిష్కరిస్తామన్నారు. ధాన్యం కొనుగోలులో డివిజన్‌ను యూనిట్‌గా తీసుకుని కొనుగోలు సాగించాలని, దీనివల్ల రైతులకుప్రయోజనం జరుగుతుందని ఎమ్మెల్యే బండారు కోరారు. రైస్ మిల్లర్స్ అసోసియేషన్ నాయకులు వంటిపల్లి పాపారావు, చుండ్రు శ్రీనివాస్, వంక అన్నవరం, రెడ్డి రామారావు, వట్టికూటి సతీష్, వైట్ల దుర్గారావు, గుణ్ణం శ్రీనివాస్, కోరా వీరభద్రరావు పాల్గొన్నారు.

పారిశుధ్య పనులు పరిశీలించిన డీఎల్పీవో

రాజోలు, ఆగస్టు 4: రాజోలు మేకలపాలెంలో పారిశుధ్య పనులను డీఎల్పీవో పి.బొజ్జిరాజు ఆదివారం పరిశీలించారు. పారిశుధ్య కార్మికులకు ఆయన పలు సూచనలు చేశారు. గ్రామాల్లో ఉన్న వీధులన్నీ పరిశుభ్రంగా ఉండాలని అధికారులకు సూచించారు. ఈవోపీఆర్డీ జి.భీమారావు పాల్గొన్నారు.

నష్టాల నమోదులో అధికారులు

పి.గన్నవరం,ఆగస్టు4: వరద ముంపు ప్రాంతాల్లో లంక గ్రామస్థులకు గోదారమ్మ కష్టాలు తెచ్చిపెట్టింది. లంకల్లో వరద ముంపు వీడటంతో ఉద్యాన పంటలకు జరిగిన నష్టాల లెక్కింపులో అధికారులు నిమగ్నమయ్యారు. గంటిపెదపూడి, ఊడిమూడి, బెల్లంపూడి, పి.గన్నవరం, ముంగండపాలెం, కె.ముంజువరం, వై.కొత్తపల్లి, మానేపల్లి, మొండెపులంక, కె.ఏనుగుపల్లి గ్రామాల్లో ఉద్యాన పంటలకు నష్టం వాటిల్లినట్లు అధికారులు చెబుతున్నారు. కూరగాయల పంటలకు పూర్తినష్టం వాటిల్లింది. వ్యవసాయాధికారుల సూచనలు పాటిస్తే అరటికి నష్టం నివారించవచ్చునని అధికారులు సూచిస్తున్నారు. వరద ముంపు తగ్గడంతో చాకలిపాలెం వద్ద కనకాయిలంక కాజ్‌వే తేరుకుంది. పది రోజులుగా ఇబ్బంది పడ్డ కనకాయిలంక గ్రామస్థులు కాజ్‌వేపై నుంచి రాకపోకలు సాగిస్తున్నారు. గంటిపెదపూడి, ఊడిమూడి శివారు నాలుగు గ్రామాలతో పాటు పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన పలు గ్రామాల లంక ప్రజలు ఇంకా నాటుపడవలపైనే ప్రయాణం సాగిస్తున్నారు.

ముంపు సమస్య పరిష్కరించకపోతే సార్వా వదులుకోవాల్సిందే



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

ఐ.పోలవరం, ఆగస్టు 4: ముంపు సమస్య పరిష్కరించకపోతే సార్వాను వదులుకోవాల్సిన పరిస్థితి తప్పదని మండల రైతులు ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబుకు ఆదివారం వినతిపత్రం అందజేశారు. పొలాల్లోని ముంపునీరు దిగే మార్గం లేక అయోమయంలో ఉన్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఐ.పోలవరం, టి.కొత్తపల్లి, దుప్పులంక, మురమళ్ళ గ్రామాలకు చెందిన పొలాల్లోని ముంపునీరు పెరుమాళ్ళ రాజ్‌కోడ్ డ్రెయిన్‌లోకి దిగుతుంది. ఈడ్రెయిన్ ఆయకట్టు తొమ్మిది వేల ఎకరాలకు పైగా ఉంటుంది. అయితే ఈడ్రెయిన్ గోదావరిలో కలిసే చివరి అవుట్ ఫాల్ స్లూయిస్ బ్రిటిష్ కాలంలో నిర్మించిందని, ఆటోమేటిక్ షట్టర్లు పాడవ్వడంతో తలుపులు ఏర్పాటు చేశారు. ఈకారణంగా ముంపునీరు బయటకు వెళ్లకుండా అవరోధమేర్పడి తొమ్మిది వేల ఎకరాల్లోని పంట పాడైపోతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యను పరిష్కరించకపోతే భవిష్యత్‌లో పొలాలు బీడు పెట్టుకోవలసిందేనని ఆందోళన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని ఎమ్మెల్యేను కోరారు.

సినిమా గైడ్

అమలాపురం

వెంకటరమణ	: శివం భజే
శ్రీలలిత	: తిరగబడరా సామి
శేఖర్ స్క్రీన్-1	: బడ్డీ
శేఖర్ స్క్రీన్-2	: అలనాటి రామచంద్రుడు
రమా	: రాయన్
గణపతి	: హరోం హర
వెంకటపద్మావతిస్క్రీన్-1	: కల్కి
వెంకటపద్మావతి స్క్రీన్-2	: డెడ్ పూల్

వసతి గృహాల విద్యార్థుల సమస్యలు పరిష్కరించండి

రామచంద్రపురం(ద్రాక్షారామ), ఆగస్టు4: ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ వసతి గృహాల విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని పీడీఎస్‌యూ నాయకులు ఆదివారం మంత్రి సుభాష్‌కు వినతిపత్రం అందజేశారు. రామచంద్రపురం, హసన్‌బాద, కె.గంగవరంలో వసతి భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయన్నారు. అద్దె భవనాల్లో వసతిగృహాలు నడుస్తున్నాయని, విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా గదులు, మరుగుదొడ్లు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి బి.సిద్ధూ, పీవైఎల్ నాయకుడు వెంటపల్లి భీమశంకరం, రామచంద్రపురం డివిజన్ నాయకుడు ఎం.సాయిచరణ్, కె.సుధీర్, వై.సతీష్, కరుణాకర్, కిరణ్ పాల్గొన్నారు.

డెంగ్యూ నివారణ ర్యాలీ

ముమ్మిడివరం, ఆగస్టు 4: సబ్ యూనిట్ ఆఫీసర్ ఆదినారాయణ ఆధ్వర్యంలో ఆదివారం ముమ్మిడివరంలో డెంగ్యూ నివారణపై అవగాహన సదస్సు, ర్యాలీ నిర్వహించారు. ఆగస్టు 30వరకు డయేరియా నిర్మూలన శిబిరాలు నిర్వహిస్తారన్నారు. ఇంటింటికీ ఆశ కార్యకర్తలు వెళ్లి డయేరియా ఎలా వస్తుంది, నివారణా చర్యలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పిస్తారన్నారు. ముమ్మిడివరం నగర పంచాయతీ సోమిదేవరపాలెం, సూరాయిచెరువు, బళ్లగేటు సెంటర్‌లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్, బి.సంపూర్ణ, వనిత, ఐశ్వర్య తదితరులు పాల్గొన్నారు.

వ్యాధిగ్రస్త బాలికకు ఆర్థిక సాయం

మామిడికుదురు, ఆగస్టు 4: అప్పనపల్లి గ్రామం అరుంధతి పేటకు చెందిన ఆకుమర్తి జ్యోతి అరుదైన వ్యాధితో బాధ పడుతోంది. బాలిక తండ్రి ఆటో డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. ఈఅరుదైన వ్యాధికి చేసే ఇంజన్ ఒక్కటీ రూ.85వేలు అవుతుంది. స్థానికులు రూ.10వేలు సేకరించి ఆదివారం బాలిక తండ్రికి అందించారు. తులా గోపాలకృష్ణ, తులా నాగరాజు, చిన్నా, విజయ్, కంకిపాటి నాగేశ్వరరావు, అల్లూరి సుబ్బరాజు, తులా బ్రహ్మజీ పాల్గొన్నారు.

వరద బాధితులకు నిత్యావసరాలు పంపిణీ

పి.గన్నవరం, ఆగస్టు 4: వరద ముంపు ప్రాంతాల్లో బాధిత కుటుంబాలకు కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో బియ్యం, నిత్యావసరాలు పంపిణీ చేసినట్లు ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి తెలిపారు. లంకలగన్నవరంలో వరద బాధితులకు నిత్యవసరాలు, బియ్యం అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ పసలపూడి రామకృష్ణ, ఎంపీటీసీ అవనిగడ్డ సత్తిబాబు, కూటమి నాయకులు ఆనందరావు, రమేష్, గనిశెట్టి ఈశ్వరరావు, యర్రంశెట్టి వెంకటరమణ, మల్లాడి గోపి, లంకే చిరంజీవి, యర్రంశెట్టి బుజ్జి, వీఆర్వో శ్రీను తదితరులు పాల్గొన్నారు.

జనసైనికులకు అండగా ఉంటా

మండపేట, ఆగస్టు4: జనసేన పార్టీ మండపేట నియోజకవర్గ కార్య కర్తలకు అండగా ఉంటానని జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి వేగుళ్ల లీలా కృష్ణ అన్నారు. స్థానిక ఏడిద రోడ్డులో వున్న విజయఫంక్షన్ హాల్‌లో ఆదివా రం జరిగిన నియోజకవర్గ జనసైనికుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి విజయం కోసం పనిచేసిన జనసైనికులకు భవిష్యత్‌లో సముచిత స్థానం కల్పిస్తామన్నారు. నియోజకవర్గంలో 12వేలు జనసేన సభ్యత్వాలు చేశామన్నారు. నాగబాబు త్వరలో నియోజకవర్గానికి వస్తారన్నారు. పార్టీ మూడు మండలాలు, పట్టణ అధ్యక్షులు, జనసైనికులు పాల్గొన్నారు.

మావుళ్లమ్మను దర్శించుకున్న ఎమ్మెల్యే

రాయవరం, ఆగస్టు4:చెల్లూరు గ్రామస్థుల ఇలవేల్పు శ్రీమావుళ్లమ్మ అమ్మవార్ని ఆదివారం ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు దర్శించుకున్నారు. అమ్మవారి తీర్థం పురస్కరించుకుని గ్రామస్థులు అమ్మవారికి పసుపు, కుంకుమ, నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ గ్రామ శాఖ అధ్యక్షుడు చుండ్రు వీర్రాజు, మాజీ సర్పంచ్ మోరంపూడి రాజ్‌కుమార్, మాజీ వైస్ ఎంపీపీ దేవు వెంకట్రాజు, మామిడిశెట్టి రామకృష్ణ, బవిరిశెట్టి అప్పారావు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కొత్తపేట, ఆగస్టు4: విద్యుత్ మరమ్మతుల నిమిత్తం సోమవారం 10నుంచి 4గంటల వరకు సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు ఈఈ ఎం.రవికుమార్ తెలిపారు. కొత్తపేట ఏనుగుల మహాల్,మందపల్లి, కేదార్లంక,చినగూళ్లపాలెం,పెదగూళ్లపాలెం, రామారావుపేట, బి.సావరంప్రాంతాలకుసరఫరా ఉండదన్నారు.

చంద్రబాబును కలిసిన సుబ్బారావు



అంబాజీపేట, ఆగస్టు 4: స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులకు ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు రూ.10వేలు గౌరవ వేతనం కల్పించేలా చర్యలు తీసుకోవాలని సీఎం చంద్రబాబుకు ఏపీ సర్పంచ్‌ల చాంబర్ సభ్యుడు నాగాబత్తుల వెంకట సుబ్బారావు వినతిపత్రాన్ని అందించారు. మంగళగిరి టీడీపీ జాతీయ కార్యాలయంలో చంద్రబాబును కలిసి గ్రామాల్లో ఉన్న సమస్యలను వివరించారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి నిధులు కేటాయించాలని కోరినట్లు సుబ్బారావు తెలిపారు.

చేనేత సమస్యలు పరిష్కరించండి



మలికిపురం, ఆగస్టు4: చేనేత సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు చేనేత నాయకుడు చింతా వీరభద్రేశ్వరరావు ఆదివారం వినతిపత్రం సమర్పించారు. గతంలో ఇచ్చిన హామీ ప్రకారం చేనేత సంఘాలకు బకాయిలను రద్దుచేయాలని, చేనేత కార్మికులకు తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ఉండే పథకాలన్నీ వెంటనే అమలులో పెట్టాలని కోరారు.

మహిళా శక్తి భవనాన్ని త్వరలో ప్రారంభిస్తాం

మండపేట, ఆగస్టు4: స్థానిక 20వవార్డు గొల్లపుంతకాలనీలో టీడీపీ హయాంలో నిర్మించిన మహిళా స్త్రీ శక్తి భవనాన్ని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు పరిశీలించారు. వైసీపీ ప్రభుత్వంలో నిరాదరణకు గురైన ఈభవనాన్ని త్వరలో ప్రారంభిస్తామన్నారు. పనులను పూర్తిస్థాయిలో చేయాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. ఆయన వెంట మున్సిపల్ మాజీ చైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్, మేడింటి సూర్యప్రకాష్, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ నల్లమిల్లి వీర్రెడ్డి, కంటిపూడి శ్రీను, మున్సిపల్ కమిషనర్ బి.రాము. మున్సిపల్ డీఈఈ శ్రీనివాస్, ఏఈ పవన్ తదితరులు ఉన్నారు.

ముమ్మరంగా పారిశుధ్య పనులు

అంబాజీపేట, ఆగస్టు4: గంగలకుర్రు అగ్రహారంగ్రామంలో రెండు డెంగ్యూ కేసులు వచ్చిన నేపథ్యంలో ముమ్మరంగా పారిశుధ్య పనులు చేపట్టారు. సర్పంచ్ దొంగ నాగేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి ఆర్.ఏడుకొండలు చంటి ఆధ్వర్యంలో గ్రామంలోని పలు కాలనీల్లో ముగ్గు, బ్లీచింగ్, ఎబెట్ మందును పిచికారీ చేయించారు. జైభీమ్‌నగర్‌లో ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. పీహెచ్‌సీ సీహెచ్‌వో బి.అప్పారావు, ఎస్ఈవో ఎస్వీ రామారావు గ్రామాన్ని సందర్శించారు. గ్రామంలో ఫీవర్ సర్వేను నిర్వహించాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. జ్వరాల కేసులపై నివేదిక ఇవ్వాలని సూచించారు.

నేడు మండపేటలో ఉచిత వైద్య శిబిరం

మండపేట, ఆగస్టు 4: స్థానికబస్టాండ్‌కు సమీపంలో బీఎస్ఎన్ఎల్ కార్యాలయం వద్ద ఉన్న సాయిఆర్థో ట్రామాఆర్థోకేర్ సెంటరులో సోమవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తామని ఆసుపత్రి వైద్యులు డాక్టర్ రాము తెలిపారు. ఎముకల సాంద్రత, కీళ్ళు, గుండె, లేజర్ లాప్రోస్కోపీ, ఫిజియో థెరపీ, మధుమేహ, ఈసీజీ,ఎక్స్‌రే పరీక్షలు ఉచితంగా చేస్తామన్నారు. పట్టణ పరిసర ప్రాంత ప్రజలు వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

మలికిపురం ఎస్ఐగా సురేష్



మలికిపురం, ఆగస్టు 4: మలికిపురం ఎస్ఐగా పి.సురేష్ నియమితులయ్యారు. ప్రస్తుతం ఆయన నగరం ఎస్ఐగా పని చేస్తున్నారు. ఇక్కడ ఎస్ఐగా పనిచేసిన బి.సంపత్‌కుమార్‌ను వీఆర్‌కు పంపిస్తూ ఎస్పీ బి.కృష్ణారావు ఉత్తర్వులు ఇచ్చారు.

సీఎం రంగసామి పుట్టినరోజు వేడుకలు



యానాం, ఆగస్టు 4: మల్లాడి అభిమాన సంఘం ఆధ్వర్యంలో మల్లాడి స్వగృహంలో పుదుచ్చేరి సీఎం ఎన్.రంగసామి 75వ పుట్టినరోజు వేడుకలు యానాంలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా భారీ కేక్‌ను కట్‌చేసి, అభిమానులు స్వీట్లు పంచారు. ఆశా వర్కర్లకు వేతనం రూ.6వేల నుంచి రూ.10వేలకు పెంచిన నేపథ్యంలో సీఎం చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. స్వీట్లు పంచారు.మల్లాడి అభిమాన సంఘం ఆధ్వర్యంలో యానాం ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పండ్లు, స్వీట్లు పంచారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ గిడ్ల చంద్రరావు, రిటైర్డ్ సీఐ గూటం శివగణేష్ తదితరులు పాల్గొన్నారు. సీఎం రంగసామికి పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు పుట్టినరోజు శుభాకాంక్షలుతెలిపారు.ఆదివారం పుదుచ్చేరిలోని సీఎం స్వగృహానికి వెళ్లిన మల్లాడి, ఎన్ఆర్ కాంగ్రెస్ యానాం అధ్యక్షుడు మల్లాడి శామ్యూల్, ఇటీవల పదోన్నతి పొందిన ఎప్‌టీసీ ఎల్ ఉద్యోగులు సీఎంను కలిసి శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

గోల్డ్ అప్రైజర్ల సమస్యలు పరిష్కరించండి

ముమ్మిడివరం, ఆగస్టు 4: గోల్డ్ అప్రైజర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర గోల్డ్ అప్రైజర్ల సంఘ అధ్యక్షుడు నలమాటి కొండలరావు ఆధ్వర్యంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుపాటి పురందేశ్వరికి వినతిపత్రం అందించారు. గోల్డ్ అప్రైజర్లు అంతా శనివారం రాత్రి రాజమహేంద్రవరంలో ఎంపీ పురందేశ్వరిని కలిసి సమస్యలు విన్నవించుకున్నారు. సెంట్రల్ బ్యాంకు ఆఫ్ ఇండియాలో పనిచేస్తున్న 60మంది గోల్డ్ అప్రైజర్లను తొలగించడం దారుణమన్నారు. ట్రాన్స్‌ఫర్లు చేయరాదని, కమిషన్ల చెల్లింపులోఅర్బను, రూరల్‌వ్యత్యాసం చూపించరాదని తదితర డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని పురందేశ్వరికి అందించారు. వెంకటాచారి, శ్రీనివాసాచారి, ఆదినారాయణాచారి ఉన్నారు.

ఆటో ఢీకొని వ్యక్తి మృతి

అల్లవరం, ఆగస్టు 4: అల్లవరంలో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డుప్రమాదంలో వృద్ధుడు మృతిచెందాడు. అల్లవరం పంచాయతీ పరిధి మామిడితోటకు చెందిన షైలాబత్తులు నాగేశ్వరరావు(60) మందుల షాపులో మందులు కొనుగోలు చేసి ఇంటికి వస్తున్నాడు. అల్లవరం గంటాలమ్మ ఆలయం వద్ద ఎదురుగా వస్తున్న ఆటో ఢీకొట్టింది. స్కూటీ వెనుక కూర్చున్న నాగేశ్వరరావు అక్కడికక్కడే మృతిచెందాడు. స్కూటీ నడుపుతున్న సాకా భూషణంకు తీవ్ర గాయాలయ్యాయి. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ జిహరీష్‌కుమార్ తెలిపారు.

బ్లాక్‌చైన్ టెక్నాలజీకి మార్కెట్‌లో డిమాండ్

అమలాపురం రూరల్, ఆగస్టు 4: బ్లాక్‌చైన్ టెక్నాలజీకి మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉందని బీవీసీ విద్యా సంస్థల చైర్మన్ బోనం కృష్ణసతీష్ పేర్కొన్నారు. భట్లపాలెం బీవీసీ ఇంజనీరింగ్ కళాశాలలో బ్లాక్ చైన్ టెక్నాలజీపై మేక్ స్కిల్డ్ ట్రైనింగ్ కంపెనీతో కలిసి మూడు రోజుల శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. క్యాడ్ అండ్ ఏఐఎంఎల్ విభాగాధిపతి సీహెచ్ రంజిత్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన శిక్షణలో ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్సీ, మెషిన్ లెర్నింగ్ విభాగాలకు చెందిన ఇంజనీరింగ్ విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించారు. విజేతలకు రూ.10వేలు బహుమతిని చైర్మన్ కృష్ణసతీష్ అందజేశారు. ప్రిన్సిపాల్ డాక్టర్ జేవీజీ రామారావు పాల్గొన్నారు.

మంత్రి సుభాష్ ఆర్థిక సాయం

ద్రాక్షారామ, ఆగస్టు4: మంత్రి వాసంశెట్టి సుభాష్ ఆదివారం తాడిపల్లిలో కృతజ్ఞతా పర్యటన చేశారు. గుండె వ్యాధితో బాధపడుతున్న సలాది సూర్యనారాయణను పరామర్శించి రూ.20వేలు అందజేశారు. దివ్యాంగురాలు జిల్లెళ్ల పాపారత్నంకు రూ.10వేలు ఇచ్చారు. నాయకులు కొప్పిశెట్టి గోవిం దు, చిక్కాల నారాయణరావు, సలాది వీరబాబు, టీడీపీ, జనసేన కార్యకర్తలు పాల్గొన్నారు.